# మార్నింగ్ వాక్

వి. వెంకట్రావు



హోరుమని శబ్దం చేస్తూ అంతెత్తునుంచి పడుతోంది జలపాతం. కొండ చివరనుంచి పడుతున్న నీటి ప్రవాహం కింద అప్పటికి గంటనుంచి స్నానం చేస్తూనే వుంది ఇందిర. చుట్టూ పచ్చని చెట్లూ, కనుచూపు మేరంతా పచ్చదనం. చిన్నచిన్న పొదరిల్లు, పెద్దపెద్ద వృక్షాలు. ఎంతసేపు వున్నా తనివితీరడం లేదు. శిరస్సుపైనుంచి శరీరమంతా తాకుతూ కాలి బొటనవేళ్ల చివరకు పోతూ, పాము మెలికల్లా పోతున్న నీళ్లను చూస్తుంటే చెప్పలేనంత ఆనందం. అలా ఎన్ని రోజులైనా వుండిపోగలదు. రెండు దోసిళ్ళతోనూ నీళ్లను తీసింది.

చేతిలో రేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్వచ్ఛమైన నీళ్ళు. ఎన్నాళ్ల కోరికో. ఇంత అందమైన ప్రదేశం ఊరికి గంట దూరంలోనే వుంది. ఎప్పటి నుంచో పోరుతూనే వుంది శేషగిరిని, తీసుకెళ్లమని. తను వినిపించుకుంటేనా. ఇన్నాళ్ళకు తీరింది.

ఎక్కడా మనుష్య సంచారమే లేదు. శేషగిరి నీళ్ళ ఒడ్డునే బైక్ పార్క్‌చేసి ఎక్కడికో వెళ్లినట్టున్నాడు. అయినా తనకేం భయం. తన మానాన తను స్నానం చేస్తూనే వుంది. ఎప్పటి కోరికో తీరుతున్నందుకు సంతోషంగా వుంది మనసూ, శరీరమూ. అయినా కావలసినన్ని నీళ్ళతో స్నానం చేయడం కూడా కలగానే మిగిలిపోతుంది ఇలాంటి చిన్నజీవితానికి. అందుకే ఈ లోకాన్ని, సంసారాన్ని మరచిపోయింది.

ఇంతలో ఎక్కడినుంచో బిందెల చప్పుడు అస్పష్టంగా చెవులను తాకుతూ. ఒక్కసారిగా తలెత్తి చుట్టూ పరికించి చూసింది. ఎవ్వరూ కనిపించలేదు. ఇంత నిర్మానుష్య ప్రదేశానికి ఎవరొస్తారు, తన భ్రమ కాకపోతే. ఈ శేషగిరి ఎక్కడికి పోయాడు. కనిపించడే. ఈసారి బిందెల చప్పుడుతోపాటు ఏవేవో మాటలు కూడా వినిపించాయి లీలగా.

అంతే..

ఒక్కసారిగా తుళ్ళిపడి లేచింది. కళ్లముందు దృశ్యం అదృశ్యమయింది.

కొళాయిలొచ్చేశాయి. వీధిలో హడావుడి ప్రారంభమయింది. ఎంత మొద్దునిద్రలో వున్నా నీళ్ల అనగానే ఉలిక్కిపడి లేస్తారు ఆ వీధి గృహిణులంతా. వేసవిలో నీళ్ల సమస్య అలాంటిది మరి.

తను లేస్తూనే పిల్లల్ని కూడా లేపింది. శేషగిరి అంతకుముందే లేచి మార్నింగ్ వాక్‌కి వెళ్లాడు. ఈమధ్యనే వెళుతున్నాడు వాకింగ్‌కి.

నాలుగు కుటుంబాలున్న పెద్ద లోగిలి అది. ఇంటి ఓనర్స్ వేరే ఎక్కడో వుంటున్నారు. ఆ నాలుగు కుటుంబాలకీ ఒకటే కొళాయి. ఈ వేసవిలో కొళాయిలు వచ్చేదే అరగంట. ఆ అరగంట వ్యవధిలోనే నాలుగు ఇళ్లవాళ్ళు వచ్చే నీటిని సర్దుకోవాలి. లోగిలి మధ్య కొళాయి ఉన్నట్లయితే నీళ్ల ధార సరిగ్గా రాదని రోడ్డు పక్కనే ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. రోడ్డు లెవెల్‌కి ఇంకా కిందనే వుంటుంది కొళాయి. సిమెంటుతో చేసిన చిన్నపాటి గొయ్యిలో వుంటుంది. అక్కడనుంచే నీళ్ళు ఎత్తి పోసుకోవాలి. ఆ కాలనీ పరిస్థితి అంతా ఇదే. ఆ అరగంటలోనే గ్లాసెడు నీళ్ళు కూడా వృథా కాకుండా చాలా హడావుడిగా పట్టుకుంటారు.

ఒక్కోసారి మరుసటిరోజు కొళాయిలు రాకపోవచ్చు ఏ ప్రకటనా లేకుండానే. వచ్చినా రాదేమోననే భయంచేత ముందురోజే నీటిని నిల్వచేసుకుంటారు. ఇందిర కూడా వీలయినంత వరకూ చిన్నా పెద్దా పాత్రలన్నిటినీ నింపేసింది.

ఇంతలోనే పిల్లలు లేచారు. వేసవికాలం కావడంమూలాన పిల్లలకి ఒంటిపూట బడులు. ఏడున్నరకే స్కూలుకి తయారుచేయాలి. పిల్లలకీ ఏదో చేసి పెట్టాలి. పొయ్యిమీద అన్నం, పప్పు పడేసింది. శేషగిరి కూడా ఉదయం భోజనం చేసేసే ఆఫీసుకి వెళతాడు.

వీధిలోనుండి పాలమ్మాయి కేక వినబడడంతో వంటింట్లో నుంచి వీధిలోకి పరుగుతీసింది. పిల్లలు స్నానాలు చేస్తూ నీళ్ళు పారబోస్తున్నారని కేకవేస్తూ, మళ్లీ వంటలో పడింది.

అప్పుడే శేషగిరి మార్నింగ్ వాక్ నుంచి వచ్చాడు. వస్తూనే బూట్లనూ, సాక్స్‌నూ ఓ మూలకి విసిరేసి, కాఫీకోసం కేకవేసి పేపరు అందుకున్నాడు. కేకవేసిన మరుక్షణమే కాఫీ సిద్ధమైంది. కాఫీ కప్పు పక్కనపెట్టేసి, సిగరెట్ వెలిగించాడు.

స్నానాలు ముగించి స్కూలుకి తయారుకాకుండా ఆటలో పడ్డాడు బాబీ. ఆమధ్య ఎగ్జిబిషన్‌లో కొన్న రైలుబండి ఆట ఆడుతున్నాడు. గుండ్రంగా వున్న రైలు పట్టాలపై పెట్టెలు పట్టాలు తప్పుతుంటే సరిచేస్తున్నాడు. శేషగిరి అదేమీ పట్టించుకోకుండా సిగరెట్ పొగని రింగులు రింగులు వదులుతూ వినోదం చూస్తున్నాడు. పొగ రింగులు గాలిలో తేలిపోయి వెళ్లిపోతుంటే కాసేపు ఆట ఆపి వాటికేసి ఆశ్చర్యంగా చూస్తున్నాడు. ఒక్కసారిగా తన చూపుడు వేలును పొగరింగుల మధ్యకు పోనిచ్చాడు. రింగులు బాబీగాడి చూపుడు వేలు దాటుకుంటూ చెయ్యి వెనుకనుంచి వాడి ముఖాన్ని దాటి వెనక్కి వెళ్లి గాలిలో కలిసిపోతున్నాయి. సిగరెట్ తాగేది శేషగిరి అయితే పొగమాత్రం బాబీగాడు పీలుస్తున్నాడు.

ఇంతలో అటుకేసి వచ్చిన ఇందిర పిల్లల్ని కేకవేసి, బొమ్మల్ని లోపల పెట్టేసి అన్నాలు పెట్టి బడికి పంపేసింది. కాసేపటికి కాలకృత్యాలు తీర్చుకుని భోజనానికి సిద్ధమయ్యాడు శేషగిరి.

అన్నం వడ్డిస్తున్న ఇందిరతో ''రేపటినుంచి నువ్వూ రాకూడదూ మార్నింగ్ వాక్‌కి. ఎంతో మంది ఆడవాళ్ళు కూడా వస్తున్నారు తెలుసా. ఆరోగ్యానికి చాలామంచిది. తెలతెలవారుతుంటే ఊరు అవతల పచ్చని పొలాలూ, పక్షుల కిలకిలరావాలు ప్రకృతి ఎంత అందంగా వుంటుందో. ఈరోజుల్లో ఆడవాళ్ళు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారు. ప్రపంచం ఇంత ముందుకు పోతున్నా మీరు మాత్రం ఇల్లు కదలడానికి ఇష్టపడరు'' అంటూ ఇంకా ఇంకా చెప్పుకుపోతున్నాడు.

మౌనంగా అన్నీ వింటోంది ఇందిర. కాసేపటి వరకూ ఏం మాట్లాడలేదు.

ఏం ఆలోచించుకుందో ఒక్కసారిగా అంది. ''మీరు ఎన్ని కిలోమీటర్లు నడుస్తారు'' అని.

క్షణకాలం ఆలోచించి ''సుమారు ఆరు కిలోమీటర్లు'' అన్నాడు.

''మన ఇంటినుంచి వీధిలో వున్న కుళాయికి మధ్య దూరం ఎంతో తెలుసా''

''తెలీదు''

''నాకూ తెలీదు. కానీ ఈమధ్య మనం వుంటున్న ఇంటి తాలూకు కొలతలు తీసుకోవడానికి ఎవరో వచ్చారు. వాళ్ళు చెప్పారని పక్కింటి కావేరి చెప్పింది. సుమారు నూరు మీటర్లట. అంటే తెలుసు కదా! కిలోమీటరులో పదవ వంతు. అంత దూరాన్ని మేం కనీసం ఓ ఏభై సార్లయినా తిరుగుతూ నీళ్ళు మోస్తుంటాం. అంటేసుమారు అయిదు కిలోమీటర్లు. దాన్నిబట్టి చూడండి. మీరు కేవలం చేతులు ఊపుకుంటూ నడిచే దూరాన్ని, మేం నీళ్ళు మోస్తూ నడవాలి. ఇంక ఆ తరువాత సంగతి మీరు చూస్తున్నదే. పిల్లలు స్కూలుకి వెళ్లేవరకూ పడే హడావుడి. ఆ తరువాత మీరు ఆఫీసుకు బయలుదేరేవరకూ నేను చేస్తున్న అష్టావధానం. కనుక మా ఆరోగ్యానికి వచ్చిన ఢోకా ఏమీలేదు. ఇక ప్రకృతిని చూడడం అంటారా. మనం మధ్యతరగతి వాళ్లం. మనకి అవసరాల తర్వాతే అలాంటి అనుభూతులు. అనుభూతులను ఆస్వాదించుకుంటూ పోతే సమస్యలే మిగులుతాయి'' అని చెబుతున్న ఇందిర నుదుటిమీద స్వేద బిందువులు కుంకుమలో కలిసి ఎర్రటి బొట్లుగా నేలమీద పడుతుంటే వాటికేసి నిర్ఘాంతపోయి అలాగే చూస్తూ వుండిపోయాడు శేషగిరి.

★

